# హృదయమందిరంలో 'ప్రథమపూజ'



అవధులు లేని

ఆ అనురాగానికి...

పరిధులు లేని ఆ ప్రేమకు...

అంకితం.



# శ్రీసాయిబాబా

శ్రీసాయిబాబా చిత్రపటం లేని ఇల్లు, సాయిమందిరం లేని పట్టణం, దక్షిణ భారతంలో ఈనాడు బహు అరుదంటే అతిశయోక్తి కాదేమో! ఈనాడు లక్షలాదిమందికి శ్రీసాయి ఇలవేలుపు. మహాసమాధి చెందిన అనతి కాలంలోనే ఒక మహాత్ముని మహిమ - సంప్రదాయం ఇంత త్వరితగతిన ప్రజాబాహుళ్యంలో సుస్థిరమవడం ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలోనే అపూర్వం! కుల మత వర్ణ భాషాభేదాలకతీతంగా అశేష భక్తులు సాయిని ఆశ్రయించేందుకు గల కారణం ఏమిటి? కొంచెం ఆలోచిస్తే, ఈనాటికీ అద్భుత రీతిన ప్రకటమవుతున్న శ్రీసాయి మహిమయే కారణమని ఇట్టే అర్థమవుతుంది. "పిలిస్తే పలికే గొప్ప నిదర్శనం గల దేముడు" ఎవరని అడిగితే, చాలా మంది ఠక్కున 'శ్రీసాయిబాబా' అని సమాధానం చెప్తారు. తమనాశ్రయించిన భక్తుల కష్టాలు, కోరికలు తీర్చడంలో శ్రీసాయిబాబా శైలి విశిష్టమైనది. బాబా కేవలం మన కోరికలు తీర్చడం మాత్రమే కాదు, వాటిని ఒక క్రమంలో, చక్కటి సంఘటనల కూర్పుతో మనకు అందించి, మన అంతరంగం వాటి వల్ల సరైన పంథాలో ప్రభావితమయ్యేటట్లు కూడా చూస్తారు. అంతేకాదు, ఆ కోరిక తీర్చింది తామేనని, అది తమ అనుగ్రహ ప్రభావమేనని ఆయా భక్తులకు స్పష్టంగా తెలియజేసేలా ఉంటాయి ఆ సంఘటనలు. తద్వారా ఆయన అవ్యాజ ప్రేమకు, కరుణకు, సర్వజ్ఞతకు, సర్వశక్తిమత్వానికి భక్తుల మనసులు ముగ్ధమవుతాయి. వారి వారి సహజ స్వభావానికనుగుణంగా భక్తులను సంస్కరించి, ఉద్ధరించి, సద్గతిని అందజేయటమే సాయి అవతార కార్యం యొక్క పరమార్థం.

# శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ

శ్రీసాయి అనుగ్రహానికి, దివ్యత్వానికి, ప్రేమకు నిలువెత్తు రూపం పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ. శ్రీసాయితత్త్వాన్వేషణలో, సాయి స్మరణలో పునీతమైంది ఆయన జీవితం. ఆ మహాత్ముని జీవన గమనంలోని ప్రతి అడుగు శ్రీసాయి అనే గమ్యానికి దారి తీసింది. ఆ మహిమాన్వితుని అడుగుజాడలే 'సాయిపథం' అనే ఆనందమార్గమై, భక్తులకు అనుసరణీయమైంది.

శ్రీబాబూజీ చెంత సాంత్వన చెందని వ్యధాభరిత హృదయం లేదు; సమస్యలు తీరని జీవితం లేదు; ఆయన ప్రేమ పాశానికి బద్ధుడు కాని భక్తుడు లేడు! అలా తమనాశ్రయించిన ఎంతో మంది భక్తులను ప్రేమతో అక్కునచేర్చుకొని, అనుగ్రహించిన శ్రీబాబూజీ అదంతా శ్రీసాయి అనుగ్రహమేనంటారు. తమ జీవితాలను ఆనందమయం చేసిన ఆ మహాత్ముని ప్రేమను చవిచూసిన అశేష భక్తజనావళి మాత్రం అదంతా శ్రీబాబూజీ మహిమేనంటారు.

విశ్వమంత ప్రేమను క్షణకాలపు వీక్షణము, రవంత నవ్వులో అందించే ఆ కరుణామూర్తి కొరకు జీవితకాలమంతా వేచివున్నా ధన్యమే, ఆ జీవితమంతా భగవ'ధ్యానమే' అన్నది ఎంతోమంది భక్తుల అనుభవం.

సాయిభక్తునిగా, విద్యావేత్తగా, రచయితగా, సంస్కర్తగా, మానవతావాదిగా, అన్నింటికీ మించి మహిమాన్విత సద్గురువుగా శ్రీబాబూజీ విశిష్టత ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలోనే ఒక అద్భుతం, అజరామరం, ఆచంద్రార్కం సదా స్మరణీయం.



# సాయిభక్తి పథంలో సాయి మందిరాలు

తన పట్ల, దైవం పట్ల, సాటి మనుషుల పట్ల సరైన అవగాహనను సమాజంలో కల్పించడానికి ప్రయత్నించక ఆలయాలు నిర్మిస్తే ఆ దేవాలయ రాతి కట్టడాలు స్వార్థంతో కరడుగట్టిన మనిషి హృదయాలకు ప్రతీకలుగా మాత్రమే నిలుస్తాయి. ఉన్నత సంస్కారాలనే విద్యాప్రణాళికతో ఆత్మ విద్యకు బళ్ళుగా మన పెద్దలు రూపొందించిన ఈ గుళ్ళు, కులాల కుళ్ళుకు, మతాల మళ్ళకు లోగిళ్ళు కారాదు అని నిష్కర్షగా ప్రకటించారు శ్రీబాబూజీ.

అయితే మరి అసలైన సాయిమందిరం ఎలా ఉండాలి? అన్న ఎంతోమందికి గల సందేహాన్ని తీరుస్తూ శ్రీబాబూజీ ఇలా వివరించారు: "అక్కడ భక్తులకు, సాయిబాబాకు మధ్య ఎలాంటి అడ్డాలు, అడ్డంకులు, మధ్యవర్తులూ ఉండకూడదు. అక్కడ సాయిపట్ల భక్తి ప్రేమలకు తప్ప తంతులకు, మంత్రాలకు, హంగులకు, ఆర్భాటాలకూ తావులేదు. అంతేకాదు, ఆలయ నిర్మాణంలోని సూక్ష్మాలను, ఆదర్శాలను బోధపరుస్తూ, ఆలయ నిర్మాణం చేబట్టే ముందు, ఆలయం నిర్మించబోయే ప్రదేశంలో మహాత్ముల చరిత్రల పఠనం, పవిత్ర ఆధ్యాత్మిక ధార్మిక గ్రంథాల అధ్యయనం, మహాత్ముల ఆశీస్సులు, సామూహిక జపధ్యానాలు కొంతకాలంపాటు జరగాలి. నిత్య సత్సంగ పారాయణల పట్ల ఆ ప్రాంతంలోని స్థానిక ప్రజలకు శ్రద్ధాసక్తులు కలగాలి. అలా జరుగుతుంటే క్రమంగా ఆ కేంద్రమే దేవాలయంగా పరిణతి చెందుతుంది. మనం నిర్మింపతలపెట్టిన బాహ్యమందిరం మన హృదయ మందిరాన్ని ప్రతిబింబించే తత్త్వమయ నిర్మాణం కావాలి" అంటారు శ్రీబాబూజీ.



ఆ మహనీయుడు నిర్దేశించిన ఆశయానికి, నిలిపిన ఆదర్శానికి అనుగుణంగా సత్సంగ కేంద్రాలుగా మొదలై, భక్తజన హృదయమందిరాలుగా పరిణతి చెందిన మందిరాలు, నిన్న... ఒంగోలు, సాయిబాబా సెంట్రల్ స్కూల్ ప్రాంగణంలోని 'సాయినాథుని ధ్యానమందిరం', నేడు తిరువణ్ణామలై, హరితాచలలోని 'సాయినాథుని ధ్యానమందిరం'.

# తెనాలి, ఆంధ్రప్రదేశ్


## 30 మే, 1993



వేసవి కాలపు వేడిమికి అల్లాడుతున్న తెనాలి పట్టణంలో చల్లని సాయిభక్తి పవనాలు వీచాయి. విషయమేమిటని ఆరా తీసిన పుర జనులకు మారీసుపేటలోని 'దత్తసాయి'మందిరంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనకు 'సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ' తమ ఊరిలో అడుగుపెట్టారని తెలిసింది.

ఆ వేడుకకు ఒక విశిష్టత ఉంది. అది ఏమిటంటే, పూజ్యశ్రీ బాబూజీ పాల్గొన్న మొట్టమొదటి విగ్రహ ప్రతిష్టాపనా మహోత్సవం ఇదే. బహుశా ఆ మందిర ప్రాంగణంలో కొంతకాలం నుండి క్రమం తప్పకుండా సత్సంగం, సాయినామం చేసుకొంటున్న భక్తుల ప్రేమ, భక్తిభావాలు ఆ మహాత్ముని సాదరంగా ఆహ్వానించాయేమో!

కళలకు, కళాకారులకు ఖ్యాతిగాంచిన తెనాలిలో ఆధ్యాత్మిక వైభవాన్ని, సాయిభక్తి సంప్రదాయాన్ని పరిఢవిల్లజేసిన ఆ మహనీయుని ఆగమనం, దర్శనం, ఆ ఆనందక్షణాలు వడివడిగా గడిచిపోయాయి. కానీ ఎంతోమంది సాయిభక్తుల హృదయాలలో ఆ అనుభవం చిరస్మరణీయంగా నిలిచిపోయింది.




## లాలాగూడా, హైదరాబాద్

### 12 ఏప్రిల్, 1998

హైదరాబాద్ 'లాలాగూడ'లో ఎ.పి.ఎస్.ఆర్.టి.సి మండపంలో నిర్మితమైన సాయిబాబా మందిరం విగ్రహ ప్రతిష్ఠకు ముస్తాబైంది. ఆ కార్యక్రమానికి సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ వస్తున్నారని తెలిసి ఆ ప్రాంతంలోని సాయిభక్తులు ఎంతో సంతోషించారు. ఆ రోజున బాబా మూర్తికి ప్రథమ పూజ చేసి, ఆరతి ఇచ్చారు పూజ్యశ్రీ బాబూజీ. ఇంకో విశేషమేమిటంటే, ఆరతి అనంతరం మందిరం లోపలే ఆసీనులై అందరికీ దర్శనమిచ్చారు.

శ్రీసాయినాథుని నూతన మందిరంలో పూజ్యశ్రీ బాబూజీని మొదటిసారి దర్శించుకున్న భక్తులు అలౌకిక ఆనందాన్ని, మును పెన్నడూ లేని ప్రశాంతతను చవిచూశారు. బహుశా సద్గురు దర్శన మహిమ అంటే అదేనేమో!

# హయత్ నగర్, హైదరాబాద్

## 25 మే, 1999

హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. ఎంప్లాయిస్ కాలనీ ఉంది. ఆ కాలనీలోని సాయిభక్తులు ప్రతి వారం 'సత్సంగం' చేసుకునేవారు. కొంతకాలానికి తమ కాలనీలో ఒక సాయిబాబా మందిరం నిర్మించుకోవాలన్న సత్సంకల్పం వారికి కలిగింది. అలా రూపుదిద్దుకున్నటువంటి ఆ సాయిమందిర 'ప్రథమ పూజ'కు తమ గురుదేవులు సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీని వారు ప్రేమపూర్వకంగా ఆహ్వానించారు.

అంతకుమునుపు శ్రీబాబూజీని శిరిడీలో మాత్రమే దర్శించుకోగలిగిన ఆ భక్త జనులకు తమ కాలనీలోని సరిక్రొత్త సాయిమందిరంలో సద్గురు కృపావిశేషంగా లభించిన వారి దర్శనం మరపురాని మధురస్మృతిగా నిలిచిపోయింది.





## సర్పదోహ్, మహారాష్ట్ర

### 3 జనవరి, 2000

శ్రీసాయినాథుడు భౌతికంగా చరించిన మహారాష్ట్ర దేశంలో, షోలాపూరు జిల్లాలోని, కర్మాల తాలూకాలోని ఓ ప్రశాంతమైన గ్రామం 'సర్పదోహ్'. ఆ గ్రామంలో క్రొత్తగా నిర్మించబడిన ఒక 'సాయిబాబా' మందిరం.

గ్రామ ప్రజలతోను, చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి వచ్చిన భక్త జనులతోనూ మందిర ప్రాంగణమంతా నిండిపోయింది. సాయినాథునికి 'ప్రథమ పూజ' చేసేందుకు శిరిడీ నుండి విచ్చేస్తోన్న సద్గురుదేవులు పూజ్యశ్రీ బాబూజీ రాకకై అందరూ ఎదురు చూస్తున్నారు.

అందమైన సాయినాథుని మందిరం, చల్లని దీవెనలిచ్చే సాయిబాబా విగ్రహం, సద్గురుమూర్తి అనుగ్రహ దర్శన భాగ్యం, ఇవన్నీ కలసి సర్పదోహ్ గ్రామప్రజల కన్నుల పండువగా సాగింది ఆ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం.

# బోధన్, తెలంగాణ

## 15 జనవరి, 2000

బోధన్‌లో 2000వ సంవత్సరం సంక్రాంతి రోజున సాయిభక్తుల సంబరాలు అంబరాన్ని అంటాయి. ముందురోజు నుండి ఇరవై గంటలపాటు ఏకధాటిగా జరిగిన 'సాయినామం'తో మందిర ప్రాంగణమంతా భక్తి భావనా తరంగాలతో నిండిపోయింది. క్రొత్తగా నిర్మితమైన మందిరంలో కొలువైవున్న సాయినాథునకు 'ప్రథమ పూజ' చేసేందుకు పూజ్యశ్రీ బాబూజీ శిరిడీ నుండి బయలుదేరారు.

అంతే, అప్పటివరకు బోధన్‌ను చుట్టుకొనివున్న చలి పలాయనం చిత్తగించింది. వాతావరణం సాధారణ ఉష్ణోగ్రతకు చేరి, ఆహ్లాదంగా మారింది. అప్పటి వరకు పరాకుగా ఉన్న ప్రకృతి, ఆ పరమపావనుని రాకను పసిగట్టి అందంగా ముస్తాబైందా అన్నట్టుండిన ఆ చందాన్నిగాంచిన భక్తులు ఆనందపరవశులయ్యారు.

ఇంకో విశిష్టత ఏమిటంటే, 'ప్రథమ పూజ' అనంతరం శ్రీబాబూజీ దర్శనం భక్తులకు మూడుసార్లు లభించింది. మొదట సాయిమందిరంలో, తరువాత ఆ ప్రక్కనే ఉన్న సత్సంగ హాలులో, చివరగా మందిర ప్రాంగణంలోని వేదికపై నుండి ఆ మహనీయుని దర్శించుకొన్న భక్త కోటి 'ధన్యోస్మి' అంటూ ప్రణమిల్లారు.





# పల్సూద్, మధ్యప్రదేశ్

## 8 జూలై, 2001

మధ్యప్రదేశ్‌లోని బడవాని జిల్లాలో చుట్టూ కొండలు, మిట్టలు, వాగులు, పైరులు నడుమ అందమైన గ్రామం 'పల్సూద్'. ఆ ఊరిలో కొంతకాలంగా సాయిభక్తులు క్రమం తప్పకుండా సత్సంగం చేసుకుంటున్నారు. క్రమంగా తమ గ్రామంలో ఒక సాయిబాబా మందిరం నిర్మించుకోవాలన్న వారి ఆకాంక్ష ఒక అవసరంగా పరిణతి చెందింది.

శ్రీసాయి అనుగ్రహ విశేషంగా ఆ గ్రామ ప్రజలంతా కలిసి మందిరాన్ని నిర్మించుకున్నారు. వారి ఆర్తిని, ఆకాంక్షను మన్నిస్తూ పూజ్యశ్రీ బాబూజీ 'ప్రథమ పూజ' చేసేందుకు ఎంతో ఆనందంగా అంగీకరించారు. అంతే, పల్సూద్ గ్రామ ప్రజల ఆనందానికి అవధులు లేవు. శిరిడీలోని 'సాయియానా'లో దాదాపు ఒక సంవత్సర కాలం ఉంచిన సాయిబాబా పాలరాతి విగ్రహాన్ని తమ గ్రామానికి తీసుకువచ్చారు. ముందురోజు గ్రామంలోని నాలుగు వీధులలో బాబాను ఉత్సవంతో ఊరేగించి మందిరానికి తీసుకువచ్చారు.

'ప్రథమ పూజ' గావించేందుకు ఏతెంచిన పూజ్యశ్రీ బాబూజీకి సాయినామం స్వాగత సత్కారాలు పలికింది. అనంతరం వేదికపై ఆసీనులైన శ్రీబాబూజీ దర్శన భాగ్యంతో 'పల్సూద్' పులకించింది. తమ గ్రామ ప్రజల తరఫున నమోవాకాలు తెలిపింది.

# తిరుపతి, ఆంధ్రప్రదేశ్

## 9 డిసెంబర్, 2001



సాధారణంగానే సదా భక్తకోటితో కిటకిటలాడే తిరుపతి క్షేత్రంలో ఆ రోజు మాత్రం భక్త జనం పోటెత్తారు. ఎందుకో తెలుసా, కొంకా వీధిలోని నూతన సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపనా మహోత్సవానికి పూజ్యశ్రీ బాబూజీ విచ్చేస్తున్నారు. ఆ మహనీయుని దర్శించేందుకు ఆంధ్రదేశం నలుమూలల నుండే గాక తమిళనాడు నుండి, విదేశాల నుండి కూడా వేలమంది భక్తులు తరలివచ్చారు. వారందరూ ఎలుగెత్తి ఏక కంఠంతో 'సాయి నామం' పలుకుతున్నారు.

తిరువేంగడనాథుని క్షేత్రంలో, సాయినాథుని చలువరాతి 'మూర్తి'కి సద్గురుదేవునిచే ప్రథమ పూజ జరిగింది. ఆ అపురూప దృశ్యాన్ని, సమాగమాన్ని దర్శించిన భక్తులందరూ భక్తి భావనా తన్మయత్వంతో మైమరచిపోయారు. జయజయధ్వానాలు పలికారు. అనంతరం ఓ మహాద్భుతం ఆవిష్కృతమైంది. అప్పటివరకు తీవ్రంగా ఉన్న మిట్టమధ్యాహ్నపు ఎండ పూజ్యశ్రీ బాబూజీ వేదికపై ఆసీనులవ్వగానే ఎటు పోయిందో, మబ్బులచాటున మాయమయింది. చల్లని అనుగ్రహ పవనాలు వీచాయి. అందరినీ ఆనందంతో, ఆశ్చర్యంతో ముంచెత్తాయి.

ప్రతి విషయాన్ని తులనాత్మకంగా విశ్లేషించి మాత్రమే ప్రచురించే 'హిందూ' దినపత్రికలో ఈ సంఘటన మర్నాడు ప్రచురితమైంది. ఆ మహాత్ముని విశిష్టతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.



## జీడిమెట్ల, హైదరాబాద్

### 14 జనవరి, 2004

హైదరాబాద్ బిఐఎసి (BIAC) ప్రాంగణంలో ఎన్నో సంవత్సరాల నుండి సాయిబాబా సత్సంగం చేసుకొంటున్నారు భక్తులు. ఆ ప్రదేశంలో సాయిబాబా మందిరం నిర్మించేందుకు సంకల్పించింది బిఐఎసి (BIAC) యాజమాన్యం.

ఆ విధంగా చక్కని సాయిబాబా మందిరం, అందులో అందమైన సాయిబాబా విగ్రహం రూపుదిద్దుకున్నాయి. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి తేదీ నిర్ణయించబడింది.

సాయి అనుగ్రహ నిదర్శనంగా, సమర్థ సద్గురు స్థానమైన శిరిడీ నుండి సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ 'ప్రథమ పూజ' చేసేందుకు విచ్చేశారు. అనంతరం మందిరం వెనుకప్రక్క ఏర్పాటు చేసిన వేదికపై ఆసీనులై, సాయినామం చేస్తోన్న అశేష భక్తజనానికి దర్శనం ప్రసాదించారు శ్రీబాబూజీ. అనేక పరిశ్రమలతో, యంత్రాలతో నిండి యాంత్రికంగా తయారైన ఆ ప్రాంతం, ఆ యతీంద్రుని దర్శనంతో ఎంతో ఆనందించింది. మరల ఏతెంచమని ప్రార్థించింది.

# పరకాల, తెలంగాణ

## 15 జనవరి, 2004



వరంగల్ జిల్లాలోని 'పరకాల' గ్రామ ప్రజల చిరకాల కోరికకు, వారి భక్తి భావనకు ప్రతీకగా వెలసిన సుందర మందిరంలో కొలువైవున్న 'సాయినాథునకు' ప్రథమ పూజగావించేందుకు 15 జనవరి 2004న పూజ్యశ్రీ బాబూజీ వేంచేశారు. వివిధ సత్సంగ కేంద్రాల నుండి, చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తజనుల 'సాయిబాబా' నామాలాపనతో, సాయిభక్తిసౌరభాలతో ఆ మందిర ప్రాంగణమంతా నిండిపోయింది.

సర్వవ్యాపకుడైన శ్రీసాయినాథునికి నిర్మించిన విశాలమైన మందిరం ముంగిట చూడముచ్చటైన ఉద్యానవనం, సుందరమైన సాయి విగ్రహం వెరసి అందంగా ముస్తాబైన 'పరకాల' సాయి మందిరంలో పూజ్యశ్రీ బాబూజీ స్వహస్తాలతో ప్రథమ పూజ, ఆరతి కార్యక్రమాలు జరిగాయి.

రకరకాల 'ఇజాల' బారిన పడిన ఆ నేలలో, ఇటు వ్యక్తికీ, అటు సమాజానికి రెండింటికీ మేలు కూర్చి, ఉన్నతినొసగే 'సాయిజం'ని, శుభ్రమైన సాయిభక్తి సంప్రదాయాన్ని పాదుకొల్పేందుకు తమ ఊరిలో అడుగిడిన మహనీయుని పదస్పర్శతో పరకాలలోని గడ్డిపరక సైతం పులకించింది. మరల మరల దర్శన భాగ్యం ప్రసాదించమని ప్రార్థించింది.

సాయిపథం

శిరిడీ